## సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన! 2



ప్రజల గళం... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం... | నిజం కోసం... నిర్భయంగా... | సమాజం . సమగ్ర అభివృద్ధి

# ప్రజానేస్తం జ్వాల

తెలుగు దినపత్రిక

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



WANTED REPORTERS
ALL OVER TELANGANA & ANDHRA PRADESH
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
Chenagani Purushotham
9603068864



అక్టోబర్ 12 సోమవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 1 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

MONDAY OCTOBER 12 2026 | VOL:1 | ISSUE: 1 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM


# హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్స్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని

---

### విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ




- విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం
- ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతూ లేఖ
- దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు
- ఈ ఉత్సవాలు పర్యాటకానికి కొత్త ఊపునిస్తాయని మోదీ ప్రశంస
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు

(మిగతా 2వ పేజీలో..)

---

### ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి.. ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు



- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు

(మిగతా 2వ పేజీలో..)

---

### మీరు మానవత్వానికే హీరో.. భారత పైలట్‌పై ఇజ్రాయెల్ అధ్యక్షుడి ప్రశంసలు



- సహ పైలట్ దాడిని అడ్డుకుని 174 మందిని కాపాడిన భారత పైలట్
- కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం ప్రకటన
- స్మిత్.. భారత్, ఇజ్రాయెల్, మానవాళికే హీరో అని కొనియాడిన అధ్యక్షుడు హెర్జోగ్
- వందేళ్ల నాటి భారత సైనికులతో పైలట్‌ను పోల్చిన ఇజ్రాయెల్
- కోలుకున్నాక జెరూసలేం వచ్చి అవార్డు స్వీకరించాలని ఆహ్వానం

(మిగతా 2వ పేజీలో..)

---

### 'ఓట్ల చోరీ'ని ఆపాలి.. రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'.. భయపడకుండా రండి: రాహుల్ గాంధీ

- ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయనున్న విపక్షాలు
- సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించాలని రాహుల్ గాంధీ పిలుపు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాసినట్లు తెలిపిన ఖర్గే
- శాంతియుత నిరసనకారులపై దాడులు జరిగాయని రాహుల్ ఆరోపణ



ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు

(మిగతా 2వ పేజీలో..)

---

### ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి
- తెలంగాణకు వచ్చి చూడాలంటూ రాహుల్ గాంధీకి సవాల్
- బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ
- దేశంలో అశాంతికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్య



నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

(మిగతా 2వ పేజీలో..)

---

### చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి–వడపళని మార్గం ప్రారంభం
- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం



చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న

(మిగతా 2వ పేజీలో..)

---

### సీఈసీ రాజీనామా డిమాండ్.. ఢిల్లీలో హైడ్రామా.. సీజేపీ నేతల విడుదల

- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరుతూ సీజేపీ నిరసనకు పిలుపు
- విమానంలోనే సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిన్న అరెస్ట్ చేసిన ముగ్గురు నేతలను ఈరోజు విడుదల



(మిగతా 2వ పేజీలో..)

---

### నిరసనలు ఆపొద్దు.. నేనున్నా.. యువతకు రాహుల్ గాంధీ పిలుపు

- రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని వెల్లడి
- మోదీ, అమిత్ షా, భగవత్‌లను విలన్లుగా అభివర్ణించిన రాహుల్
- అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదని కేంద్రానికి సవాల్
- ఢిల్లీలో నిరసనకారుల అరెస్టుల నేపథ్యంలో ఘాటు వ్యాఖ్యలు

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ




(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాల్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళ్లు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.

## మీరు మానవత్వానికే హీరో.. భారత పైలట్‌పై ఇజ్రాయెల్ అధ్యక్షుడి ప్రశంసలు

విమానంలో సహ పైలట్ దాడిని ధైర్యంగా తిప్పికొట్టి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై ఇజ్రాయెల్ ప్రశంసల వర్షం కురిపించింది. ఆయన సాహసానికి గుర్తింపుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఇజ్రాయెల్ ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' అందజేయనున్నట్లు ప్రకటించింది.ఈ మేరకు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ శనివారం కెప్టెన్ స్మిత్‌కు ఒక లేఖ రాశారు. వందేళ్ల క్రితం పవిత్ర భూమిలోని నగరాల విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టిన భారత సైనికుల సరసన స్మిత్ నిలుస్తారని హెర్జోగ్ కొనియాడారు. "మీరు ఇకపై మా ప్రజల చరిత్రలో ఒక చిరస్మరణీయ భాగం" అని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడిస్తూ "కెప్టెన్ స్మిత్ మచ్చుర్.. మీరు ఇజ్రాయెల్, భారత్, యావత్ మానవాళికి హీరో" అని ప్రశంసించారు.కెప్టెన్ స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన హెర్జోగ్.. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత జెరూసలేంకు వచ్చి తన చేతుల మీదుగా అవార్డును స్వీకరించాలని ఆహ్వానించారు. ప్రాణాపాయ స్థితిలోనూ ఆయన చూపిన ధైర్యసాహసాలు, విచక్షణ అమోఘమని కీర్తించారు. ఇటీవల దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లోని గొడ్డలితో సహ పైలట్ హమామ్ అల్-హమామి.. కెప్టెన్ స్మిత్ మాచర్‌పై దాడికి యత్నించాడు. అయితే, కెప్టెన్ స్మిత్ ధైర్యంగా ఆ దాడిని ఎదుర్కొని విమానాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చారు. ఈ ఘటనను యూఏఈ అధికారులు 'ఉగ్రవాద దాడి'గా అభివర్ణించారు.

## సీఈసీ రాజీనామా డిమాండ్.. ఢిల్లీలో హైడ్రామా.. సీజేపీ నేతల విడుదల

మొదటి పేజీ తరువాయి)

నిరసనకు ముందు యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రయాణికులు వీడియోలు తీస్తుండగా విమానంలోనే నాటకీయ పరిణామాలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టేందుకు ఢిల్లీకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలను పోలీసులు విడుదల చేశారు. నిన్న ఎయిర్ ఇండియా విమానంలో నాటకీయ పరిణామాల మధ్య అదుపులోకి తీసుకున్న అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఈరోజు విడుదలయ్యారు. ఈ నిరసనకు ముందే గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్న ప్రముఖ యూట్యూబర్, ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీని కూడా పోలీసులు తెల్లవారుజామున 3 గంటలకు విడిచిపెట్టారు.నిన్న ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అయిన కొద్ది నిమిషాలకే ఈ నాటకీయ ఘటన చోటుచేసుకుంది. వాణిజ్య విమానంలో ఇలాంటి దృశ్యాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. విమానం టచ్‌డౌన్ అయిన వెంటనే, మహిళా సిబ్బందితో కూడిన ఢిల్లీ పోలీసుల బృందం విమానంలోకి ప్రవేశించి సీజేపీ నేతలు ముగ్గురినీ అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో విమానంలోని తోటి ప్రయాణికులు ఆశ్చర్యపోయి, తమ మొబైల్ ఫోన్లలో ఈ దృశ్యాలను వీడియో తీశారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులతో అభిజీత్ దిప్కే వాగ్వాదానికి దిగారు. తాను అరెస్ట్ కావడానికే ఢిల్లీకి వచ్చానని ఆయన ఆగ్రహంతో అధికారులతో చెప్పడం వీడియోల్లో రికార్డయింది. అనంతరం ముగ్గురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఢిల్లీ కంటోన్మెంట్‌లోని అడిషనల్ సిటీ మేజిస్ట్రేట్ (ఏసీఎం) కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు ఇవాళ వారిని విడుదల చేశారు. సీఈసీకి వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనకు ముందే చోటుచేసుకున్న ఈ వరుస అరెస్టులు, విడుదలలు ఢిల్లీలో చర్చనీయాంశమయ్యాయి.

## సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన గోవా పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే వారం ఢిల్లీలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకోవాల్సి ఉన్నందున, గోవా పర్యటనను రీషెడ్యూల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఎన్నికల ప్రక్రియలోని లోపాలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై విపక్ష కూటమి ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కీలక సమయంలో రాహుల్ గాంధీ ఢిల్లీలోనే ఉండటం వల్ల విపక్షాల ఐక్యత బలపడుతుందని, పోరాటానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దగా క్రియాశీలంగా లేని పలువురు విపక్ష నేతలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి, 2027 గోవా అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనను ఖరారు చేశారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం, ప్రజలతో మమేకం కావడం, సంస్థాగత బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రచించారు. అయితే, రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నేతలు 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ స్థాయి పోరాటానికే ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాహుల్ పర్యటన ఎంతో ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో నిరసనలు ముగిసిన తర్వాత గోవా పర్యటనకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



# హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

మొదటి పేజీ తరువాయి)

ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు.గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు.ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

## 'ఓట్ల చోరీ'ని ఆపాలి.. రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'.. భయపడకుండా రండి: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరఫున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు. "భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు.మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు.శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

మొదటి పేజీ తరువాయి)

పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది.ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి.. ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి)

కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## నిరసనలు ఆపొద్దు.. నేనున్నా.. యువతకు రాహుల్ గాంధీ పిలుపు

మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యువత తమ నిరసనలను కొనసాగించాలని, వారికి ప్రతిపక్షం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని ఓడించి, దానిని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. చెన్నైలో శనివారం జరిగిన "ఛాత్రోం కీ గూంజ్" విద్యార్థి కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌ను పిరికిపందలుగా అభివర్ణించిన రాహుల్.. దశాబ్ద కాలంగా వారితో పోరాడుతున్నందున వారి తీరు తనకు బాగా తెలుసన్నారు. హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లను ఈ కథలో "విలన్లు" అంటూ ఘాటుగా విమర్శించారు. తమ పోరాటంతో వారికి అందుబాటులో ఉన్న అవకాశాలు తగ్గిపోతున్నాయని అన్నారు. "మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఎంతమంది పోలీసులను మోహరించినా, ప్రతిపక్ష నేతలను, యువతను అరెస్టు చేసినా తాము భయపడబోమని సవాల్ విసిరారు. ఈ మేరకు తన వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'ఖాతాలో పంచుకున్నారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదని, 3,000 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే, నిరసనకారులకు తన పార్టీ అండగా నిలుస్తుందని రాహుల్ స్పష్టం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# శరన్నవరాత్రులకు శ్రీకారం.. భక్తులతో కిటకిటలాడిన భద్రకాళీ ఆలయం!

**తొలిరోజే వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**ప్రత్యేక పూజలు.. భవానీ దీక్షాపరులతో ఆధ్యాత్మిక సందడి**

**హనుమకొండ / వరంగల్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన వరంగల్ శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజు ఆదివారం సెలవు దినం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ**

ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయంలో రద్దీ పెరిగింది. సాధారణ, ప్రత్యేక దర్శన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**భవానీ దీక్షాపరులతో సందడి**

శరన్నవరాత్రుల ప్రారంభాన్ని పురస్కరించుకుని భవానీ మాలధారులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నవరాత్రి



పూజా కార్యక్రమాలు, నిత్యార్చనలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి.

**భక్తులకు సౌకర్యాలు.. పోలీసుల బందోబస్తు**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, సంబంధిత శాఖలు ఏర్పాట్లు చేపట్టాయి. క్యూలైన్లలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.నవరాత్రుల తొలి రోజే భక్తుల రాకతో కళకళలాడిన భద్రకాళీ క్షేత్రం, రాబోయే రోజుల్లో మరింత ఆధ్యాత్మిక సందడిని సంతరించుకోనుంది.

# సొంత నిధులతో బస్టాండ్‌కు మరమ్మతులు

**ప్రజా సమస్యపై స్పందించిన ముల్కనూర్ ఉపసర్పంచ్ మమత బాలకృష్ణ**

**ప్రయాణికులు, ఆర్టీసీ బస్సుల ఇబ్బందుల తొలగింపునకు చొరవ**

**భీమదేవరపల్లి, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

ప్రజా సమస్యల పరిష్కారంలో తనవంతు బాధ్యతగా ముందడుగు వేసి ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కాసుగోని మమత బాలకృష్ణ మానవత్వాన్ని చాటుకున్నారు. ముల్కనూర్ బస్టాండ్‌లో గుంతల కారణంగా ప్రయాణికులు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆమె.. తన సొంత నిధులతో మరమ్మతులు చేయించి ప్రజల మన్ననలు పొందారు.

**గుంతలతో ప్రయాణికులకు ఇక్కట్లు**

గతంలో రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బస్టాండ్ పక్కన నూతన మురుగునీటి కాలువలు నిర్మించడంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు బస్టాండ్ ప్రాంగణంలో గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యం నెలకొంది.

**సొంత ఖర్చులతో మరమ్మతులు**

ఈ సమస్యను గుర్తించిన ఉపసర్పంచ్ కాసుగోని మమత బాలకృష్ణ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన సొంత నిధులతో బస్టాండ్‌కు



మరమ్మతులు చేయించారు. దీంతో ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గేలా చర్యలు చేపట్టారు.

**స్థానికుల అభినందనలు**

ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై స్పందించి, అందుబాటులో ఉన్న మార్గాల్లో పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా ప్రజల అవసరాన్ని గుర్తించి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించిన ఉపసర్పంచ్ మమత బాలకృష్ణ చొరవను స్థానికులు అభినందిస్తున్నారు.

# తల్లిని కోల్పోయిన పసిబాబుకు అండగా కేరమేరి అభిమాని గ్రూప్

**దాతల సహకారంతో రూ.31,870 ఆర్థిక సాయం అందజేత**

**పసిబాబు భవిష్యత్తు, పోషణ, వైద్య ఖర్చులకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు**

**కేరమేరి, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపించారు కేరమేరి అభిమాని గ్రూప్ సభ్యులు. తల్లిని కోల్పోయిన పసిబాబు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు దాతల సహకారంతో రూ. 31,870 విరాళాన్ని సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేరమేరి మండలంలోని చిన్న సాకాడ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. పసిబాబు భవిష్యత్తుకు ఆర్థిక భరోసా తల్లిని కోల్పోయిన పసిబాబు పోషణ, భవిష్యత్తు, వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభిమాని గ్రూప్ సభ్యులు దాతల సహకారంతో ఆర్థిక సాయం సమకూర్చారు. సేకరించిన మొత్తం రూ. 31,870ను మూడు విభాగాలుగా కేటాయించారు. పసిబాబు భవిష్యత్తు కోసం రూ. 20,000, నిర్వహణ, పోషణ ఖర్చుల కోసం రూ. 6,870, వైద్య అవసరాల కోసం రూ. 5,000 అందజేశారు. కష్టకాలంలో చిన్నారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు సభ్యులు తెలిపారు. సేవా కార్యక్రమంలో పలువురి భాగస్వామ్యం ఈ కార్యక్రమంలో కేరమేరి అభిమాని గ్రూప్ సభ్యులు చాహకటి శ్యామ్ రావు, కొట్నాక అమృత్ రావు, మడావి భరత్ భూషణ్, చాహకటి సంజీవ్ కుమార్ పాల్గొని పసిబాబుకు విరాళాన్ని అందజేశారు. గ్రూప్ అడ్మిన్ మెస్రం శేఖర్ బాబు, మెస్రం లింగు, పెందోర్ సంతోష్, ఆత్రం పరమేష్, చిన్న సాకాడ గ్రామ పటేల్ పెందోర్ దాంబి, కేరమేరి సర్పంచ్ పెందోర్ ఆనంద్ రావు, కేరమేరి మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరం, ఉపాధ్యాయులు ఎం. అర్జున్, ఎన్. నారాయణ, కె. జంగు తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల పటేళ్లు, సర్పంచులు, యువకులు సైతం కార్యక్రమానికి హాజరై తమ సంఘీభావాన్ని తెలిపారు.ఆపదలో అండగా నిలవడమే నిజమైన మానవత్వం

తల్లిని కోల్పోయిన పసిబాబు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ముందుకు వచ్చిన దాతలు, అభిమాని గ్రూప్ సభ్యుల సేవలను పలువురు అభినందించారు. చిన్నారి అవసరాలను గుర్తించి ఆర్థిక సహాయం అందించడం మానవతా విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతి దాతకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ బిల్లా యాదగిరి

**గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రార్థన**

**శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న సర్పంచ్**

**వేలేరు, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



వేలేరు మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పూజలు సమర్పించి, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలుగ్రామంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్, భరత్, కిరణ్, మహేష్, వేద పండితులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి సంక్షేమ సంఘం మరింత అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే కొండా సురేఖ

**కాశీబుగ్గలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు**

**పద్మశాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులకు ఘన సన్మానం**

**వరంగల్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



సమాజ హితం కోసం పనిచేస్తున్న ప్రజా సంఘాలు మరింత అభివృద్ధి సాధిస్తూ, ప్రజలకు విస్తృత సేవలు అందించాలని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ఆకాంక్షించారు. వరంగల్ నగరంలోని కాశీబుగ్గ శివాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సంఘం సభ్యులకు ఘన సన్మానం

ఈ సందర్భంగా కాశీబుగ్గ పద్మశాలి సంక్షేమ సంఘం (1008) అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కొండా సురేఖ శాలువాలతో ఘనంగా సత్కరించారు. సంఘం ప్రతినిధులతో ఆత్మీయంగా మాట్లాడి, వారు చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. సమిష్టి కృషితో మరిన్ని సేవలు అందించాలి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంఘం సభ్యులు సమిష్టి కృషితో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పద్మశాలి సంక్షేమ సంఘం ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్తులో సంఘం మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సంప్రదాయాల మధ్య బతుకమ్మ సంబరాలు కాశీబుగ్గ శివాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు, పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతువేదికల్లో నేడు సీఎం, వ్యవసాయశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్

**మధ్యాహ్నం 12 గంటలకు రైతులతో ముఖాముఖి**

**ఎల్‌నినో ప్రభావం, పంటల సాగు, నీటి యాజమాన్యంపై చర్చ**

**హనుమకొండ, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



జిల్లాలోని రైతువేదికల్లో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి సంయుక్తంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వేర్పుల విజయ్ చంద్ర వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులకు అవసరమైన సూచనలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై అవగాహన ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, పంటల సాగు విధానాలు, నీటి యాజమాన్యం, నేలలో తేమను సంరక్షించే పద్ధతులు వంటి కీలక అంశాలపై రైతులతో ముఖాముఖి చర్చించనున్నట్లు డీఏఓ వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సకాలంలో హాజరుకావాలి జిల్లాలోని రైతులు, ప్రజాప్రతినిధులు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు తమకు సమీపంలోని రైతువేదికలకు చేరుకుని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యవసాయానికి సంబంధించిన ముఖ్యమైన సూచనలు తెలుసుకోవాలని సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి: ఆత్రం సుగుణక్క

- నూతన కార్యవర్గానికి దిశానిర్దేశం.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**రెబ్బెన, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా రెబ్బెన మండలంలోని గోలేటి, దుగ్గాపూర్‌లో నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ అధ్యక్షుల సన్మాన, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. పార్టీ పదవులు బాధ్యతతో కూడుకున్నవని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసరి కిషన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

- 12వ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌కు శ్రీకారం
- ప్రారంభించిన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్, ఎస్పీ

**ఆసిఫాబాద్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**




ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల పాఠశాల క్రీడా మైదానంలో 12వ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీ నగేష్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్, ఎస్పీ నితిక పంత్ కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో అండర్-10, అండర్-12, అండర్-14 విభాగాల్లో క్రీడాకారులు పోటీపడుతున్నారు. పరుగు పందాలు, లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ త్రో, ట్రయథ్లాన్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తున్నాయి.

## రెడ్‌క్రాస్ ఖమ్మం జిల్లా కోశాధికారిగా యార్లగడ్డ రాఘవ గౌడ్

**KSF ప్యానల్ తరపున ఎన్నికైన గోపా లైఫ్ మెంబర్‌కు అభినందనలు**

**ఖమ్మం (ప్రజానేస్తం జ్వాల):**



ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (IRCS) ఎన్నికల్లో KSF ప్యానల్ తరపున పోటీ చేసి సభ్యుడిగా ఎన్నికై, జిల్లా కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించిన గోపా లైఫ్ మెంబర్ యార్లగడ్డ రాఘవ గౌడ్‌కు గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిద శ్రీనివాస్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదిగా సేవలందిస్తున్న రాఘవ గౌడ్, భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) ఖమ్మం జిల్లా కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరింత సేవలందిస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్ సేవా ప్రస్థానం విజయవంతంగా కొనసాగాలని గుడిద శ్రీనివాస్ గౌడ్ మరోసారి అభినందనలు తెలిపారు.

## రైతుపై వ్యాఖ్యలు.. గజ్వేల్ తహశీల్దార్‌పై సస్పెన్షన్ వేటు!

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వ్యాఖ్యలు**

**కలెక్టర్ హైమావతి ఉత్తర్వులు.. అధికార వర్గాల్లో చర్చ**

**గజ్వేల్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



రైతును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు గజ్వేల్ తహశీల్దార్ స్వామికి ఇబ్బందిగా మారాయి. శనివారం ఓ రైతుతో ఆయన మాట్లాడిన తీరు, చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తహశీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ మేరకు కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. రైతుతో అధికారి వ్యవహరించిన తీరుపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతుండగా, ఈ చర్య అధికార వర్గాల్లోనూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## బీఆర్ఎస్ శతాబ్ది వేడుకలకు నంగునూరు నుంచి భారీగా తరలిన శ్రేణులు!

**నంగునూరు, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు నంగునూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం భారీగా తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా జిల్లా కేంద్రానికి బయలుదేరాయి. పార్టీ శతాబ్ది వేడుకల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పయనమయ్యారు. వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మండలంలో సందడి నెలకొంది. పార్టీ చరిత్ర, ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహించిన వేడుకల్లో పాల్గొనేందుకు నాయకులు, కార్యకర్తలు ఆసక్తి చూపారు. నంగునూరు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

**కెరమెరి, లింగాపూర్, సిర్పూర్ (యు) మండలాలకు కొత్త నాయకత్వం**

**ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం సాధనకు ఐక్య పోరాటం**

**జైనూర్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి, లింగాపూర్, సిర్పూర్ (యు) మండలాల తెలంగాణ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జిల్లా అధ్యక్షుడు చెంద్యాల రాంచందర్ అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎండీ అంకుష్, కోశాధికారి సోగాల రవి తదితరుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

**మూడు మండలాలకు నూతన కార్యవర్గాలు**

కెరమెరి మండల అధ్యక్షుడిగా పి. విజయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జిల్లపల్లి రాజేశ్వర్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మాదాసు కమలాకర్, కోశాధికారిగా రాథోడ్ అర్జున్ ఎన్నికయ్యారు. లింగాపూర్ మండల అధ్యక్షుడిగా ఆడే సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా అన్నులే ఓంకార్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా జాదవ్ అశోక్, కోశాధికారిగా దినకరి ప్రకాష్ ఎన్నికయ్యారు. సిర్పూర్ (యు) మండల అధ్యక్షుడిగా కొడప అంబాజీరావు, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ వసంత్ రావును ఎన్నుకున్నారు.

**ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం**

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో తీర్మానించారు. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి ప్రయోజనాలు ప్రతి ఉద్యోగికి



అందేలా అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని నిర్ణయించారు. జిల్లా, రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చే కార్యక్రమాలను మండలాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**నూతన కార్యవర్గాలకు సన్మానం**

నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను ఉద్యోగులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మూడు మండలాలకు చెందిన వివిధ శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి హాడక్ కమిటీ ఏర్పాటు

**జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్, ప్రొబేషన్ సమస్యల పరిష్కారానికి పోరాటం**

**సొంత నియోజకవర్గాల్లో పోస్టింగ్‌ల కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం**

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

రికార్డు అసిస్టెంట్లు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ నుంచి గ్రామ పాలన అధికారులుగా నియమితులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి హాడక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, తమకు జరుగుతున్న అన్యాయంపై సుదీర్ఘంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

**జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కోసం డిమాండ్**

రికార్డు అసిస్టెంట్లు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ నుంచి గ్రామ పాలన అధికారులుగా నియమితులైన వారికి సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సొంత నియోజకవర్గాల్లో పోస్టింగ్‌లు కల్పించేలా కృషి చేయాలని తీర్మానించారు.

**రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు**

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరపడం, వివిధ మార్గాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, హక్కుల సాధనకు సమిష్టిగా పోరాడడం లక్ష్యంగా కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి తెలంగాణ గ్రామ పాలన అధికారుల సంఘం గా నామకరణం చేశారు.

**కమిటీ బాధ్యులు వీరే**

అధ్యక్షుడు: లక్మల్ల నరసింహారావు -- సూర్యాపేట,- ప్రధాన కార్యదర్శి: మహమ్మద్ ఫరీద్ -- సంగారెడ్డి,అసోసియేట్ అధ్యక్షుడు: బండారి వెంకటేశ్వర్లు -- పెద్దపల్లి,కోశాధికారి: కూన రాజేందర్ -- కరీంనగర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ: పిట్టె శ్రీశైలం -- మహబూబ్‌నగర్



ఉపాధ్యక్షులు: సిలివేరి ప్రవీణ్ (సిరిసిల్ల), గున్నం సంతోష్ (నిజామాబాద్), తలారి గోపాల్ (వికారాబాద్), తుమ్మల శ్రీను (నల్గొండ).

సహాయ కార్యదర్శులు: పి. శ్రావణ్ (పెద్దపల్లి), ఎండీ రఫీ (కామారెడ్డి), కావాలి యాదగిరి (మహబూబ్‌నగర్), ఎల్. హరి చరణ్ (నిజామాబాద్).

కార్యవర్గ సభ్యులు: పల్లె వెంకటేష్ (వికారాబాద్), వి. స్వామి (నల్గొండ), కావలి శివ (వికారాబాద్), కె. సంపత్ (నల్గొండ).

నూతన కమిటీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ, ఉద్యోగుల వేతన సవరణ, ప్రొబేషన్ సమస్యలు, పోస్టింగ్‌ల అంశాలపై పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## కరెంటు కోతలపై రైతుల ఆగ్రహం.. తడ్కల్‌లో బీజేపీ ధర్నా!

**24 గంటల ఉచిత విద్యుత్ కోసం డిమాండ్..**

**తడ్కల్ మండల ఏర్పాటు ఎప్పుడంటూ నిలదీత**

**నారాయణఖేడ్, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

రైతులకు ఎదురవుతున్న విద్యుత్ కోతల సమస్యపై బీజేపీ కిసాన్ మోర్చా పోరుబాట పట్టింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం తడ్కల్ గ్రామంలో రైతుల ఇబ్బందులకు నిరసనగా రోడ్డుపై ధర్నా నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా కార్యదర్శి కే. నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో రైతులు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**విద్యుత్ కోతలతో సాగుకు ఆటంకం!**

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో అవసరమని, తరచూ కోతల వల్ల పంటలకు సకాలంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని, సరఫరాలో అంతరాయాలను తొలగించి సాగుకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

**తడ్కల్ మండల ఏర్పాటు హామీ ఏమైంది?**

విద్యుత్ సమస్యతో పాటు తడ్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా నాయకులు, స్థానికులు మరోసారి ప్రస్తావిస్తున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకుడు కే. నరేందర్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టినా ఆశించిన ఫలితం దక్కలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడ్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువవుతాయని, వివిధ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తగ్గుతాయని వారు చెబుతున్నారు. గతంలో ఉద్యమాలు చేసినా డిమాండ్ నెరవేరకపోవడంపై అసంతృప్తి వ్యక్తం



చేస్తున్నారు.

**సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్**

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు తడ్కల్ మండల కేంద్రం ఏర్పాటు అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌పై కార్యాచరణ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు!

- కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శనం

**భీమదేవరపల్లి, అక్టోబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ప్రసిద్ధ కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు**

ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అర్చకులు గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహనతో పాటు చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బాలాత్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.




**భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ**

పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షణలో ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.